


# ఒక ఆకలి రాత్రి

గణపతిరావు కొమ్మనాపల్లి

**ఒక గంట** క్రితమే అర్ధ రాత్రి దాటింది.

భాగ్యనగరంలోని క్లాక్‌టవర్ సమీపాన ఒక పార్కు.

చౌరస్తా లోని విద్యుద్దీపపు కాంతి పళ్లెలపై అరుదుగా ప్రసరించే ప్రభుత్వ ప్రణాళికలా పార్కు లోకి వ్యాపిస్తోంది.

పార్కుకు దూరంగా మైదానంలో వేదిక, దాని ముందు బారులు తీర్చిన మెర్క్యురీ లైట్లు మరణించిన ఒక మహానుభావుని భౌతిక కాయం ముందు మౌనంగా శ్రద్ధాంజలులు ఘటిస్తున్న మహానాయకుల్లా నిలబడి ఉన్నాయి.

నిజానికి ఆ మైదానం సర్వత్రా ప్రభుత్వం పేదలకు దానం చేసిన భూమిలా ఎప్పుడూ బీడు పడే ఉంటుంది. అలాంటిది ఆ రోజు అంతటి సౌభాగ్యానికి నోచుకోవటానికి కారణం ఆ నాటి సాయంకాలం అక్కడో కొత్త మంత్రిగారికి జరిగిన భారీ సన్మానం.

"ఈ దేశంలో నిరుపేదల్ని నిర్మూలించటమే నా తక్షణ కర్తవ్యమని మరోసారి గట్టిగా వక్కాణిస్తున్నాను" అంటూ మెడలోని పూల దండల భారాన్ని మోయలేక గగ్గోలు పెట్టినట్టు అరిచిన అమాత్యవర్యులు నిర్మూలించేది పేదతనాన్నా పేదల్నా అని ఆలోచించని జనం అలవాటుగా కొట్టిన చప్పట్ల కార్యక్రమం ముగిసి చాలా సేపయింది.

"పచ్చని ఫాలభాగాన కాశ్మీరాన్ని అద్దుకుని జీలమ్—చీనాబ్ నదీ పాయల్ని కుంతలాలుగా సింధు లోయ సంస్కృతిని కంఠాభరణంగా కూర్చుకుని, ఉత్తుంగ హిమాలయ శ్రేణుల్ని స్తన్యసంపదగా మార్చుకుని, త్రివేణీ సంగమం నాభి కాగా ఉత్కృష్ట వేదోపనిషత్తులకు జన్మ నిచ్చిన పడతి... తరగని సిరుల భారంతో సొలిపోతూ పరవశాన పాదాలను సింధువు లో ముంచిన కన్యాకుమారి భారతి...ఆ కన్యకు పుట్టిన కుంతీపుత్రులు మన మంత్రిగారు" అంటూ బాకా ఊదిన ఒక కవిగారి వాక్కులు పరాన్న భుక్కులైన కొందరు ప్రబంధ కవుల్ని గుర్తు చేసిన ప్రహసనం ముగిసి మూడు గంటలైంది.

ఇంతటి శ్లాఘనీయమైన చరిత్రతో జేగీయమానంగా వెలిగిపోతున్న ధరిత్రిలో ఆ పార్కులోని చీకటి ఒక పొదమాటున ఆకలి మూల్గులతో మెలికలు తిరిగి పోతున్న ముష్టి రాములు పొట్టపై రోకటి పోటులా ఉంది.

సద్దు మణిగిన పార్కులో నిద్రిస్తున్న పేదలు పగలంతా ప్రభుత్వ విధానాలకు నిరసనగా అరిచి

అలసటగా నిద్రపోతున్న ప్రతిపక్ష సభ్యుల్లా ఉన్నాయి. అప్పుడే వాడిపోతున్న నైట్‌క్వీన్స్ అంత క్రితమే మానభంగం చేయబడిన ఒక మహిళలా మగతగా పడి వుంటే—మధ్యనిలచిన కలుపు మొక్కలు కొన్ని అత్యాచారాన్ని చూసి సాక్ష్యం చెప్పలేని సామాన్యుల్లా చెవులు కొరుక్కుంటున్నాయి.

టవర్ మీది క్లాక్ పసరులో ఉన్న ప్రభుత్వాన్ని ఏమీ చేయలేక ప్రగతి లేని జాతి స్వగతంలా గొణుగుతూ ఉంది.

నిప్పుల్లో మాడుతున్నట్టు రొప్పుతూ ఒక పక్కకు ఒత్తిగిల్లాడు రాములు.

రెండు రోజుల నుండి ఏమీ నింపుకోని పొట్ట గుట్టుగా రోదిస్తుంటే గట్టిగా వూపిరి సైతం తీయలేక అవస్థ పడుతున్నాడు.

స్వతంత్రం వచ్చిన మూడేళ్ళకు భూమి పైబడ్డ రాములు బుద్దెరగక ముందే తల్లి దండ్రుల్ని, పోలియో మూలంగా కాళ్ళని పోగొట్టుకుని స్వతంత్రంగా ముష్టెత్తుకుంటూ బతికేస్తున్నాడు. పూట పూటకీ తిండి కోసం ప్రాకులాడుతూ అడ్రసు లేని ఎందరిలోనో ఒకడిగా ఓటు హక్కు లేకపోయినా కూటి హక్కు కోసం దిక్కులన్నీ దేకుతూ ఉంటాడు.

దొరికితే కడుపు నింపుకుంటాడు. దొరకని వాడు ముడుకుల్ని కడుపులో కుక్కుకుంటాడు.

అలా ముప్పయ్యేళ్ళుగా జీవనం సాగిస్తున్న రాముల్ని మూడు రోజుల కిందట హఠాత్తుగా ఆక్రమించిన జ్వరం ముప్పు తిప్పలు పెట్టి ముష్టికక్కూడా వెళ్ళకుండా చేయడంతో అలాగే ఒక పాదమాటున నేలని కరుచుకుని ఉండిపోయాడు.

పిండుటానికేమీలేని పేద పేషెంటును విదిలించుకున్న వైద్యునిలా ఒక గంట క్రితమే జ్వరం వదిలి వెళ్ళడంతో గుర్తు కొచ్చింది బాగా ఆకలేస్తోందని.

నీరసం నిప్పుతున్న ప్రేవులపై రంపాల్లా రాపిడిని పుట్టిస్తుంటే దోపిడీ చేయబడ్డ దేవుడి గుడిలోని రాముడిలా నిస్తేజంగా నలిగి పోతున్నాడు.

"ఛీ. యెధవ బతుకు."

తెలుగు సాహిత్యంలో మారని స్టాక్ ఎక్స్‌ప్రెషన్స్ కుంటికాళ్ళను చూస్తూ గంటకోసారైనా మంటగా తిట్టుకునే రాములు అనుకోబోయి అసంకల్పితంగా బయటికే అనేశాడు.

అవతల పొద దగ్గర ఏదో అలికిడి.

వేళగాని వేళ ఆకలి తీరే మార్గం కనిపించని రాములు అలికిడి గురించి అంతగా పట్టించుకోలేదు.

దేవుడికి జాలి లేకపోయినా గాలి దేవుడికైనా కరుణ కల్గి ఎంగిలి విస్తరాకైనా ఎగిరి వస్తే బాగుణ్ణని బాధ పడ్డాడు.

అలా బాధ పడటం రాములుకు హాబీ కాదు—అలవాటు.

పట్టెడన్నం దొరకని రోజున పుట్టెడు దుఃఖం ముంచుకొస్తుంటే పనికిరాని కాళ్ళపై పగతో గుద్దుకుంటాడు. కాళ్ళుంటే ఖాలీ వాలీ అయినా చేసుకునే వాడినని కూలిదొరక్కపోతే కనీసం దొంగతనం చేసి ఉడాయించటానికైనా వీలుండేదని ఖాళీగా కూర్చుని ఆలోచిస్తుంటాడు.

కడుపులో ఆకలి చేస్తున్న కరాళనృత్యం ఛరాళ్ మని నొప్పి పుట్టించింది.

"అమ్మా!"

పలుకులు నేర్చే పసికందు పెదవుల్ని కలపగానే ఉద్భవించే తొలి ప్రణవ నాదం మరణవేదనలా మరో మూలకు వినిపించగానే మరోమారు అలికిడైంది.

నొప్పితో కడుపును గుప్పిట పట్టుకున్న రాములు—మీదపడ్డ నీడను చూసి ముందు ఉలిక్కి పడ్డాడు.

కరాళ దంష్ట్రల మధ్య కోసుకుపోతున్న ప్రేవుల బాధను ఒక్క క్షణం మరిచి, మూసుకుపోతున్న రెప్పల్ని బలంగా తెరిచి బలవంతంగా పక్కకు చూశాడు.

ఎవరో ఒక ఆడది.

ఏ తల్లి మనసో కదిలిందని కదిలి తనను ఆదుకోవాలని కదిలి వచ్చిందని తలపోశాడు.

నేరకపోయి నిరాహార దీక్షకు కూర్చున్నానని ఆకలితో నలిగిపోతున్న కార్మిక నాయకుడు తమ కోర్కెలకు యాజమాన్యం సమ్మతించిందని తెలియగానే నిమ్మరసంతో నీరసాన్ని వదిలించుకున్నంత ఆనంద మనిపించింది.

చిల్లులు పడ్డ చీకటి లాంటి చీరను ఒంటికి చుట్టుకుని కళ్ళను చిట్లిస్తూ ముందుకు వంగిన ఆమె 'వస్తావా' అని అడగబోయి —"రాములూ! నువ్వా?" అంది నిరాసక్తంగా. డబ్బు లిచ్చే విటుడు



కోసం ఎదురు చూస్తుంటే డబ్బు లాక్కునే రక్షక భటుడ్ని చూసినట్లనిపించింది.

ఆమె కంఠాన్ని గుర్తించిన రాములు—ఆమె పిలవగానే ప్రత్యక్షమైన దేవతగాడని తెలుసుకుని, పదవి కోసం పార్టీ హైకమాండ్ పాదాలను గట్టిగా పట్టుకున్నాకకూడా లిస్టులో పేరులేని నష్ట జాతకుడిలా నకనక లాడిపోయాడు.

"సీతాలూ...నువ్వంటే!"

పలకరించబోయిన రాములు అనవసరమైన శ్రమ ఎందుకని అలాగే నోరు తెరుచుకుని ఉండిపోయాడు.

సమకాలీన రామరాజ్యంలో కష్టాలను కంఠం వరకూ దిగమిగుకుంటూ బతుకుతున్న రాములుకు సీతాలు ఏమీ కాదు.

భర్తుంటే భార్యగా బతికేది, అన్న వుంటే చెల్లిగా సుఖపడేది. అలాంటి వాళ్ళెవరూ లేకపోవడంతో ఇద్దరు పిల్లలకు తల్లి మాత్రం అయింది. తన కడుపులోని ఆకలి తీర్చుకోవడంతోపాటు కడుపున బుట్టిన ఇద్దరు పిల్లల ఆకలి తీర్చాలని, ఆమ్మాయి అయినందుకు మరో దారి కానరాక ఒంటిని నమ్ముకుంది. దానినే అమ్ముకుంటూ బతుకుతూంది.

రోజు గడవాలంటే సీతాలు రోజూ పార్కుకు రావాలి.

కాని, రెండు రోజులుగా రాలేకపోవటానికి కారణం పిల్లలిద్దరికీ ఒంట్లో నలతగా ఉండటమే.

అందుకే నిమ్మళించాక ఇద్దర్నీ గుడిసెలో వదిలి, రేవు గడవడటం కోసం ఈ రోజు రాత్రే పార్కుకు వచ్చింది.

ఆకలితో ప్రాణం కడంటి పోతుంటే ఆశగా బయటకు చూస్తూ నిలబడింది.

ఇద్దరూ ఆకలి మేట్స్ కాబట్టి తరచుగా పార్కులో కలుసుకుంటారు. దారులు వేరైనా ఇద్దరూ పడే శ్రమ ఆకలికోసమే కాబట్టి పరామర్శించుకుంటారు తప్ప ప్రశ్నించుకోరు.

అందుకే పాసింజరు అనుకుని రాములు దగ్గరకు వెళ్ళిన సీతాలు—నిజం తెలుసుకుని, పరిచయమున్న అపరిచితురాలిలా విడిపోయి పార్కు అంచున నిలబడి పైకి చూస్తూంది.

"ఎవరది?" ధాటీగా వినబడ్డ కంఠానికి అక్కడ పొదమాటున ఉన్న రాములుతో పాటు పార్కు గోడ దగ్గర నిలబడ్డ సీతాలూ అదిరి పడింది.

పాసింజరైతే బాగుణ్ను అనుకున్న సీతాలు—లాఠీ పట్టుకు నిలబడ్డ పోలీసు జవానుని చూడగానే పక్క ఎముకల్ని పట్టకారుతో నొక్కినట్టు బెదిరి పోయింది. ఆకలితో రొట్టె ముక్క కోసం ఆర్తిగా నిలబడ్డ పసికందు పులి నోట పడ్డట్టు విలవిల్లాడి పోయింది.


"నువ్వేటే. లంగాలం...పద."

సీతాలును పోలీసు లాక్కెళుతుంటే నిర్వేదంగా నవ్వుకున్నాడు రాములు.

సీతాలు మీద జాలితో బాధ పడ్డాడు.

సీతాలు పోలీసుల పరమైనందుకు కాదు అతని బాధ.

ఆకలి తీరక సీతాలు వస్తే అది తీరక పోగా, అప్పలంగా మరొకరి ఆకలి తీరే సాధనమై పోతున్నందుకు.




"శవానికి ఉరి సిచ్చయేసే మనుసులు..."

మునిషి బతుకుల్లోని మందభాగ్యపు జాతకాల గురించి మధన పడుతూ ఉండిపోయాడు.

"ఎదవ లోకం. ఎదవ నేయం."

ఆకలి బాధను లోకం పైకి మళ్ళించుకున్నాడు. కసిగా కళ్ళు మూసుకున్నాడు.

పార్కుకు దూరంగా ఆ నాటి సాయంకాలం మైకులో వినబడ్డ మాటల్ని మననం చేసుకున్నాడు.

పార్కులో కూర్చుని ఎవరో అనుకున్న మాటల్నీ గుర్తు చేసుకున్నాడు.

"నల్లకుంటలో ఒక ఇంటి దోపిడీ."

"సికిందరాబాదులో దొంగతనం. చోరీ."

ఆకలి. ఆకలి. ఆకలి.

మీ దోపిడీ లన్నింటికీ కారణం ఆకలి.

కాదు. కాదు. మరెవరో అరిచినట్టయింది

ఆకలి కోసం ఒళ్ళమ్ముకునే సీతాలు ఆకలి బాధకు తాళలేక రొట్టె ముక్క దొంగతనం చేసిన వ్యక్తులూ చట్టం దృష్టిలో నేరస్థులైనా వాళ్ళు దోపిడీగాళ్ళు, దగాకోర్లు కారు

ఆకలి కోసం కాక అంతస్తు కోసం లోకాన్ని దోపిడీ చేసే వ్యక్తులే నిజమైన నేరస్థులు కాని వాళ్ళని చట్టం ఏమీ చేయలేదు. కారణం చట్టాన్ని చేసింది వాళ్ళు. చట్టాన్ని తమ చుట్టంగా మార్చుకోగల శక్తివంతులు. చేతిలో కత్తున్న వాడు తన చేతి నెప్పుడూ నరుక్కోడు. అందుకే సీతాలు, తన లాంటి రాములుల్లూ దోషులై పోతుంటారు.

కసితో పైకి లేచాడు రాములు.

దూరంగా రొద చేసుకుంటూ వెళుతున్న ఖరీదైన కార్లనీ దగ్గరలో నిలబడ్డ ధనవంతుల భవంతుల్ని కిటికీల లోనుంచి కనిపిస్తున్న చిరుకాంతుల్ని చూసి సహించలేనంత ఆవేశంతో కదిలిపోయాడు. లోకాన్ని నరికేయాలన్నంత ఉద్రేకంతో వూగిపోయాడు.

ఎవరినైనా హత్య చేసైనా ఆకలి తీర్చుకోవాలను కున్నాడు.

ఆవేశంతో పైకి లేవబోతూ అర్థం చేసుకున్నాడు తనకు కోపం ఉన్నా కాళ్ళు, లేవని. ఉక్రోషంతో కళ్ళలో నీరు చిమ్మింది.

"యెదవ బతుకు." స్టాక్ డైలాగ్‌ను మరో మారు గుర్తు చేసుకున్నాడు.

ఇంతలో—"చోర్. చోర్. పకడో". దూరంగా అరుపులు. బూట్ల టకటకలు...క్రమంగా దగ్గరవుతున్నాయి.

ఏం జరిగిందో తెలుసుకునే లోగా రాములుని తన్నుకుంటూ నేలపడి పైకి లేచి పరుగెత్తాడో వ్యక్తి.

ఒడిలో పడ్డ మూటని చూసి పరుగెత్తుతున్న మనిషిని పట్టించుకోవటం మానేశాడు.

అందులో ఏదున్నా ఒక్క రొట్టెముక్కయినా దొరుకుతుందేమోనని ఆబగా ఆశగా మూటవిప్పాడు.

అందులో రొట్టెముక్క లేదు. అప్పటికీ ఆకలి తీర్చలేని జిగేల్ దిమంటున్న బంగారపు నగలు.

వాటిని చూడగానే విభ్రాంతిగా ఉండిపోయాడు రాములు.

ఆకలితో అలమటించే వాడికి హఠాత్తుగా దేవుడు ప్రత్యక్షమై నీకు అన్నం తప్ప అన్నీ సమకూరుతాయి అని వరం ఇచ్చినట్లు ఇబ్బంది పడిపోయాడు.

"తూ. దీని యివ్వ." అనేంతలో బలంగా ఎవరో జబ్బ పట్టుకున్నట్టే. బెదురుగా చూశాడు పోలీసులు.

రాములు జరిగిందేదో చెప్పబోయాడు.

చెప్పబోతున్న వాడల్లా లాఠీదెబ్బలతో కుప్పలా కూలి పోయాడు.

• • • •

ఆ మరుసటి రోజు దినపత్రికల్లో ప్రచురించబడిన—"నగరంలో సంచలనం సృష్టిస్తున్న దొంగ ముఠాలోని ఒక వ్యక్తి అరెస్టు. నగల యజమాని కోసం పోలీసు కుక్కలు విస్తృతంగా గాలిస్తున్నాయి" అన్న వార్త దేనికి సంబంధించిందో మనకు తెలీదు.

అంతే రాములు చాలా ఆనందంగా ఉన్నాడు.

దాని కారణం దొంగతనం చేయాలనుకున్నా అర్థం వచ్చిన అవిటి కాళ్ళు—ఏ అడ్డంకీ లేకుండా దొంగగా మార్చినందుకు కాదు.

కుంటిదైన ధర్మదేవత తన రెండు కాళ్ళనూ ఎరువుగా తీసుకుని నాలుగు పాదాలతో నైస్‌గా నడుస్తున్నందుకు. అలా నడుస్తున్న దానికి సాక్ష్యంగా పోలీసు కస్టడీలోనైనా పట్టె డన్నం దొరుకుతున్నందుకు. ★